**కథ**

# లేదు...వాళ్లిద్దరూ ఇష్టపడ్లేదు!

**"లేదు... వాళ్లిద్దరూ ఇష్టపడలేదు" కుండబద్దలు కొట్టినట్టు చెప్పేడు కుటుంబరావు.**

**ఆ మాట విన్న వాళ్లందరం విస్తుబోయాం.**

**"అవునా?" ఆశ్చర్యం వెలిబుచ్చాడు ముందుగా తేరుకున్న గిరిధర్.**

**అవునన్నట్టు తలూపాడు కుటుంబరావు.**

''ఏ ఒక్కరికీ ఇష్టం లేదా'' అనుమానంగా అడిగేడు మురళి.

''లేదు'' తొణక్కుండా అన్నాడు కుటుంబరావు.

''అయితే ఇష్టంలేని పెళ్లన్నమాట'' అదోలా అన్నది సావిత్రి.

''అలా అనటానికి వీల్లేదు. ఇష్టపడి పెళ్లి చేసుకోవటానికి, ఇష్టాయిష్టాల్తో పన్లేకుండా పెళ్లి చేసుకోడానికీ అయిష్టంగా పెళ్లాట్టానికి బోల్డంత తేడా వుంది'' సావిత్రి మాటల్లోని విపరీతార్థాన్ని కొట్టి పారేస్తూ అన్నాన్నేను.

''ఉన్న విషయం అదీ. ఇక ఎవరెన్ని రకాలుగా అయినా సమర్ధించుకోవచ్చు. ఎవరి తెలివితేటల మేరకు వారు అర్థాలు చెప్పుకోవచ్చు''

'ఇక సావిత్రి నోటిని అదుపులో పెట్టకపోతే ఈ వార్త అలా అలా ఆ నోటా ఆ నోటా పడి ఎంతటి ఉపద్రవానికైనా దారితీయొచ్చు' అనుకున్నాను నేను. అందుకే-

''సావిత్రి నువ్వు తెలిసీ తెలియకుండా ఎవరి దగ్గరయినా ఈ విషయం ప్రస్తావించావంటే లేనిపోని అనర్థాలొచ్చి పడతాయి, ఆలోచించుకో'' అన్నాను మందలింపుగా.

''మహానుభావా! వాళ్లది ఇష్టపడి చేసుకున్న పెళ్లో కాదో వాళ్ల దగ్గరా, వీళ్ల దగ్గరా మాట్లాడాల్సిన పని నాకేం లేదు. నేనెవరి దగ్గరా ఏం మాట్లాడను. మీరు అనవసరంగా వర్రీ అయి ఆరోగ్యం పాడుచేసుకోకండి. నిశ్చింతగా వుండండి. సరేనా. అయినా ఇలాంటి విషయాలు దాస్తే దాగేవా?'' అంటూ నా దగ్గర్నుంచి వెళ్లిపోయింది.

★ ★ ★

నేను, నా భార్య సావిత్రి, బంధుమిత్రులు, కుటుంబరావు, మురళి... మేమంతా అలా మాట్లాడుకున్నది మా పెద్దన్నయ్య కూతురు తులసి పెళ్లిలో. అదీ ఎప్పుడనుకున్నారూ? సరిగ్గా ఇరవై రెండు సంవత్సరాల క్రితం.

అప్పటి ముచ్చట నాకు ఇప్పుడు గుర్తుకు రావటానికి కారణం- తులసి, ఆమె భర్త అనిల్, వాళ్లబ్బాయి పెళ్లికి మమ్మల్ని పిలవటానికి రావటమే.

మొన్న మొన్న పెళ్లిచేసుకున్న తులసి అప్పుడే కొడుకు పెళ్లి చేసేంత పెద్దదైపోయిందని ఆశ్చర్యం వేసింది నాకు. నేను ఎత్తుకుని ఆడించిన పసిపిల్ల, నా కళ్ల ముందు తప్పటడుగులు వేసిన తులసి, కొడుక్కు పెళ్లి చేసేంత పెద్దదయిందన్న విషయం నాకు సంబరాన్ని కలిగించింది. అదుగో ఆ ఆనందంలో గతస్మృతులు అలా గుర్తొచ్చి తులసి పెళ్లి నాటి ముచ్చట మనసులో కదలాడింది.

★ ★ ★

ఎల్లాగైతేనేం ఆరోజు సావిత్రి వెంటా, వెనకాల తిరిగి ఆమె ఎవరి దగ్గరా నోరు జారకుండా జాగ్రత్త పడి పెళ్లి తతంగం, మూడు నిద్రలు పూర్తయ్యాక ఇల్లు చేరేం.

అటు తర్వాత అప్పుడప్పుడు అన్నయ్యకు ఉత్తరాలు రాసి తులసి సంసారం గురించిన వివరాలు తెలుసుకుంటుండే వాడిని. వాళ్లిద్దరూ చాలా అన్యోన్యంగా వుంటున్నారని, అల్లుడు చాలా యోగ్యుడని, ఒకర్నొకరు బాగా అర్థం చేసుకుని కాపురాన్ని చక్కగా నడుపుకుంటున్నారనీ అన్నయ్య రాసిన ఉత్తరాలు నాకు సంతోషాన్ని కలిగించేవి.

వాళ్ల పెళ్లయిన నాలుగయిదు సంవత్సరాలకు కాబోలు నేను, సావిత్రి పిల్లల్తో సహా సకుటుంబ సపరివారంగా తులసి వాళ్ల ఊరు వెళ్లి, వాళ్ల ఇంట్లో రెండు రోజులు వుండి కూడా వచ్చాము. అప్పటికి ఈ పెళ్లి కొడుక్కి అక్షరాభ్యాసం కూడా కాలేదు.

అక్కడున్న రెండు రోజుల్లో రెండవ రోజు మధ్యాహ్నం పిల్లలంతా ఎవరి దారిన వాళ్లు ఆడుకుంటున్నారు. ప్రయాణబడలిక వల్ల కొంత, భుక్తాయాసం వల్ల కొంత సావిత్రి మాత్రం గుర్రు పెట్టి నిద్రపోతున్నది. అల్లుడుగారు అన్నం తినగానే ఎవరో కొలీగ్ వస్తే పనుందని బయటకు వెళ్లారు. అప్పుడు ఏకాంతంగా దొరికిన తులసిని పిలిచాను.

''ఏంటి బాబాయ్'' ఆప్యాయంగా అంటూ నా దగ్గరకు వచ్చి సోఫాలో నా పక్కనే కూర్చుంది.

తలమీద చేయి వేసి ప్రేమగా నిమిరాను.

''ఏమ్మా! మీ ఆయన చాలా బాగా చూసుకుంటున్నాడు కదూ'' అన్నాను.

''అవును బాబాయ్! నేనంటే ఆయనకి చాలా ఇష్టం బాబాయ్. ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారు'' సంతోషంగా చెప్పింది తులసి.

''ఆ విషయం నీ ముఖంలోనే కనిపిస్తున్నదమ్మా. నీ సంసారం చూశాక నాకు చాలా చాలా తృప్తిగా వుందమ్మా. చాలా ఆనందంగా వుంది'' అన్నాను.

నవ్వుతూ మౌనంగా కూర్చుంది తులసి.

అంతలోనే తేరుకుని ''అవునూ అప్పుడు మీ నాన్న ఈ సంబంధం ఖాయం చేసుకుందాం అంటే నువ్వు నసిగేవుట. ఆయనేం బాగున్నాడనీ, అప్పుడే ఏం తొందరనీ అన్నావని చెప్పుకున్నారు. అటువంటి వాడిపైన ఇంత ప్రేమ ఎలా పుట్టుకొచ్చిందే'' అన్నాను తమాషాగా.

''నిజమే బాబాయ్! అప్పుడాయనంటే అంతగా ఇష్టపడని మాట నిజమే. అయినా ఒకవేళ అప్పుడు ఇష్టపడినా, ఆ ఇష్టానికి ఈ ఇష్టానికి చాలా తేడా వుంటుంది బాబాయ్. ఎందుకో ఇదే అసలయిన ఇష్టమేమో అనిపిస్తుంది నాకు మాత్రం'' ఆరిందలా చెప్తున్న తులసి మాటలు నాకు ఎంతగానో నచ్చాయి.


''ఇంటి పనితో పనిమనిషి రాని రోజున నేను అలసిపోతే ఆయనెంతగానో బాధపడతారు. అలాంటి మనిషి మీద ఇష్టం పెరక్కుండా ఎలా వుంటుంది బాబాయ్? నాకు కాస్తంత నలతగా వుంటే చాలు తెగ కంగారు పడిపోయి అన్నం కూడా సరిగా తినరాయన. అలాంటి మనిషి మీద ఇష్టం కలగదా బాబాయ్? నా కోసం ఆయన ఎన్నో అలవాట్లు మార్చుకున్నారు. అంత మంచి మనిషి దొరకటం నా అదృష్టం బాబాయ్'' అని చెప్పిన తులసిని ప్రేమగా దగ్గరకు తీసుకుని లాలించాను.

'అంత మంచి మగవాడ్ని మొగుడిగా ఏ ఆడది మాత్రం ఇష్టపడదూ' అనుకున్నాను మనసులో. అంతలోనే కొందరు గుర్తొచ్చి మంచిని మంచిగా అర్థం చేసుకునే సంస్కారం వున్న వాళ్లే ఆ మంచి వాళ్ల మీద ఇష్టం పెంచుకుని కాపురం చక్కబెట్టుకుంటారని కూడా అనుకున్నాను.

★ ★ ★

బయట నుంచి వచ్చిన భర్తకు, నాకు, నిద్రలేచిన సావిత్రికి కాఫీ కలిపి ఇచ్చింది తులసి. కాఫీలు అయ్యాక ''మీరు రాత్రికే ప్రయాణం అంటున్నారు. మనిద్దరం కాసేపలా బయటకు వెళ్లొద్దాం పదండి మామయ్యగారూ'' అన్నాడు అనిల్ ఆప్యాయంగా.

అతనితోపాటూ స్కూటర్‌పైన బయల్దేరాను.



పార్క్‌కి తీసుకెళ్లాడు. ఇద్దరం లోనికి నడిచి ఓ ఏకాంత ప్రదేశంలో కూర్చున్నాం.

''నేను చాలా అదృష్టవంతుడ్ని మామయ్య గారూ. తులసి నా భార్య కావటం నిజంగా నా అదృష్టం. ఏ మగాడైనా ఎటువంటి మొగుడైనా తులసి లాంటి మనిషిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తాడు, ప్రేమింపబడతాడు. లేకపోతే వాడు మనిషే కాడు'' అతనే సంభాషణ ప్రారంభించాడు.

మృదువుగా అతని చేతిని స్పృశించాను.

''నిజం చెప్పాలంటే ముహూర్తాలు పెట్టుకునే సమయానికి తులసిని చేసుకునేందుకు నేనంత సుముఖంగా లేను. అమ్మానాన్నలకు ఆమె బాగా నచ్చటంతో అర్ధాంగీకారంగా ఆగిపోయాను. ఆమె మెడలో మూడుముళ్లూ వేశాను. అదేం చిత్రమో! ఆ క్షణం నుంచీ ఆమె నా మనిషి అనే భావన ఆమెపై నాకు ఇష్టాన్ని కలిగించింది. అటు తర్వాత ఆమె ప్రవర్తన ఆ ఇష్టాన్ని మరింత మరింత పెంచసాగింది. ఇప్పుడామె నా ప్రాణం. మా మధ్య దాపరికాల్లేవు, డామినేషన్స్ లేవు. వుయార్ సో హేపీ.''

''నాకూ మిమ్మల్ని చూసి చాలా ఆనందం కలిగింది బాబూ. ఆలుమగలంటే ఇలా వుండాలి అనిపించింది నాకు. ఇలాంటి చిన్న చిన్న విషయాలు తెలీక, కనీస పరిజ్ఞానం లేక అగాధాలు సృష్టించుకుంటున్నారు చాలా మంది. యూ బోత్ ఆర్ ఐడియల్ టు మెనీ అదర్స్'' అన్నాను మెచ్చుకుంటూ.

''ప్రేమించి పెళ్లి చేసుకోవడం తప్పని నేను చెప్పను. కానీ ఎంత కాదన్నా ఆ ప్రేమలో ఆ ఇష్టంలో ఓ ఆకర్షణ దాగి వుంటుందనేది అక్షర సత్యం. కానీ పెళ్లయ్యాక పెంచుకునే ఇష్టంలో, ప్రేమలో ఆకర్షణ కాకుండా మనసుకు మాత్రమే తెలిసిన ఓ అనుభూతి ఏదో ప్రముఖ పాత్ర వహిస్తుంది. దాన్లో దొరికే సుఖం, హాయి అనుభవైకవేద్యం. దానికి సాటి మరొకటి లేదనే నేననుకుంటాను. తులసి పట్ల నా ఇష్టాన్ని ఎందుకో మీతో చెప్పాలనిపించింది. చెప్పాను'' అంటూ ముగించాడతడు.

ఇద్దరం కలిసి ఇంటికి చేరాం.

తిరుగు ప్రయాణంలో వాళ్లిద్దరూ విడివిడిగా నాకు చెప్పిన విషయాల్ని సావిత్రితో చెప్పాను.

''దాన్ని ఇష్టం అనరేమో! రాజీపడడం అంటారనుకుంటా. లేదా సర్దుకుపోవటం అని కూడా అనొచ్చు'' సావిత్రి, సావిత్రిలాగానే మాట్లాడింది.

''తివిరి ఇసుమున తైలంబు దీయవచ్చు'' అనే పద్యాన్ని మనసులోనే మననం చేసుకుని ఆనందంగా వున్న నా మనసుని ఆవేశపూరితం చేసుకోవటం ఇష్టంలేక మిన్నకుండిపోయాను.

★ ★ ★

తులసి కొడుకు పెళ్లికి ఇంటిల్లిపాదిమీ హాజరయ్యాం. పెళ్లి ఘనంగా జరిగింది. వధూవరులు చూడముచ్చటగా వున్నారు. పెళ్లంతా అయిపోయాక-

''ఇంతకీ మీరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారా? పెద్దలు కుదిర్చి చేశారా?'' వధూవరుల్ని అడిగింది సావిత్రి.

అందుకు ప్రతిగా సావిత్రి వెనక నుంచున్న తులసి, అనిల్‌ల నుంచి వచ్చింది సమాధానం-

''లేదు... వాళ్లిద్దరూ ఇష్టపళ్లేదు''

*

**పెనుమాక నాగేశ్వరరావు**